# సర్దార్ జస్వీందర్‌సింగ్



పరాక్రమానికి పెట్టింది పేరయిన పంజాబ్‌లోని గ్రామాలన్నీ ఒకేలా ఉంటాయి.

మున్నే గ్రామం ఉదయకాంతుల్లో మెల్లగా కళ్లు తెరుస్తోంది. వీడిపోతున్న చీకట్లను మరింత బెదరగొడుతూ జోగిందర్‌సింగ్ గొంతెత్తి పాడుతున్నాడు. అతనికి చూపులేదు. అయినా మనసులో ఏర్పరుచుకున్న గుర్తుల ప్రకారం స్వేచ్ఛగా ఆ ఇంట్లో, బయట ఖాళీ ప్రదేశంలో కర్ర సాయంతో తిరగగలడు. సకాలంలో ఆపరేషన్ చేయించుకోలేక పోవడంతో శుక్లాలు ముదిరి, అతని దృష్టి పోయింది. ఇలాంటి సందర్భాల్లోనే పేదరికం శాపంగా అనిపిస్తుంది.

వేకువ జామునే ఇంటిముందున్న నులక మంచం మీదకి చేరతాడు జోగిందర్‌సింగ్. ఆ మంచం మీద కూర్చోగానే ఒక్కమాటు ఉత్సాహం ఆవరిస్తుంది. కేరింతలు కొడ్తున్న వేకువ పక్షుల ఉదయగానాలతో గొంతు కలుపుతాడు. అలా తనివితీరా పాడిపాడి అలసటగా నడుం వాలుస్తాడు.

అప్పుడు కోడలు గురదయాళ్‌కౌర్ పెద్ద గ్లాసునిండా చిక్కని పాలు తెచ్చి మామగారి చేతికిస్తుంది. ఆ గ్లాసులోంచి కొద్దికొద్దిగా పాలు తాగుతూ కొడుకు జస్వీందర్ గురించి ఆలోచిస్తుంటాడు. ఇప్పుడతనికి ఇరవైమూడేళ్లు. శిఖ్ఖుమతం స్వీకరించి, సర్దార్ జస్వీందర్‌సింగ్‌గా మారాడు. శిఖ్ఖుల పదవ గురువు గోబిందసింగ్ చరిత్ర అంటే అతనికి ప్రాణసమానం. ఆయన స్ఫూర్తితోనే అమృతపానం చేసి ఖాల్సాగా మారాడు.

చాలామందికి శిఖ్ఖుమతం గురించి సరయిన అవగాహన లేక పలు అపోహలతో ఉంటారు. ప్రపంచంలో ఏ వ్యక్తి అయినా శిఖ్ఖుమతం స్వీకరించవచ్చు. శిఖ్ఖుల పిల్లలే శిఖ్ఖులవాలని రూలు ఏమీలేదు. ఎవరైనా శిఖ్ఖులు కావొచ్చు. జాతి, కుల వివక్షలు లేని ఆదర్శపథం శిఖ్ఖు మతం. నిజానికి మతాలుగా చెప్పబడుతున్న వన్నీ దైవధర్మాలే!

జస్వీందర్‌సింగ్ ఇప్పుడు 8, శిఖ్ఖ్ రెజిమెంట్‌లో సిపాయిగా తన సేవలందిస్తున్నాడు. క్రిందటిసారి శెలవులకి వచ్చినప్పుడు అంటే కేవలం నాలుగు నెలలక్రితమే గురుదయాళ్‌కౌర్‌తో వివాహం జరిగింది. మామగారు రిటైరయిన సుబేదార్ సంతోష్‌సింగ్. వాళ్లిద్దరి మధ్య మంచి సాన్నిహిత్యం ఉంది. అదే బాంధవ్యానికి దారి తీసింది. సర్దార్ సంతోష్‌సింగ్‌కి యుద్ధానుభవాలు పుష్కలంగా ఉన్నాయి. రెండుసార్లు తూటా

**కాటూరు రవీంద్రత్రివిక్రమ్**

గాయాలనుండి ప్రాణాలతో బయటపడ్డాడు.

"మృత్యువు నా ప్రియనేస్తం"– అంటుంటాడు నవ్వుతూ. వార్ధక్యం పైబడుతున్నా ధృఢంగా, రీవిగా ఉంటాడు. ఆయనే జస్వీందర్‌సింగ్‌కి గురుగోబిందసింగ్ చరిత్ర పుస్తకం బహుకరించాడు. ధర్మరక్షణలో శిఖ్ఖులు చేసిన త్యాగాలు, చూపిన వీరత్వం ప్రపంచ చరిత్రలో మరెక్కడా కానరావు. అందుకే జస్వీందర్‌కి శిఖ్ఖు ధర్మం



సిపాయిలు దేశమాతకి ముద్దు పాపాయిలు. ప్రాణాలను పణంగా పెట్టి, మన సరిహద్దుల్ని సదా రక్షిస్తూంటారు. వారి వీరగాథలు యువతకి ఆదర్శం, స్ఫూర్తిదాయకం కావాలి.

ఈ కథలు వాస్తవ సంఘటనల నేపధ్యంతో రచించబడ్డాయి. రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1964 నుంచి 1980 వరకు వైమానిక దళంలో పనిచేసిన కాలంలో స్వయంగా రెండు యుద్ధాలలో పాల్గొన్నారు. మిలట్రీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అనేక మంది యుద్ధవీరుల విజయగాథల గురించి వివరాలు సేకరించారు. యుద్ధరంగం వేదికగా, దేశభక్తి ఊపిరిగా, త్రివిధ దళాల యుద్ధవీరులు సజీవ పాత్రలుగా వెలువడు తున్న ఈ కథలు 'కథాకేళి' పాఠకులకు ప్రత్యేకం.

పట్ల వెర్రి అభిమానం.

★ ★ ★

హవల్దార్ హర్వీందర్‌సింగ్ పింకీ తన జేబు లోంచి కొన్ని ఎండు ద్రాక్షలు తీసి జస్వీందర్ చేతిలో పోసాడు. తను కూడా కొన్ని తీసుకుని ఒక్కొక్కటీ తింటూ సరిహద్దుల ఆవల ఉన్న శత్రువుల శిబిరాల మీద డేగ చూపు చూస్తు న్నాడు.

బహుశః వాళ్లు కూడా తమని పరిశీలిస్తూ ఉండవచ్చు. కఠినమైన బండరాళ్లు, మంచు పేరుకు పోతున్న కొండలు, ప్రమాదకరమైన లోయలు, ప్రాణాలు 'హరీ' మనిపించే మంచు గాలులు - అదీ యుద్ధరంగం.

శత్రువు ఈ కొండలను ఎందుకు ఆక్రమిం చుకుని ఆర్భాటం చేస్తున్నాడో అంతుబట్టటం లేదు. మొన్నటిదాకా జస్వీందర్‌తోబాటు తను కూడా కాశ్మీర్ ఉగ్రవాదులతో సమరం సాగిం చాడు. అది దోబూచుల దొంగాటలాంటిది. చాటునుంచి గ్రెనేడ్లు విసరటం, రిమోట్‌తో ట్రక్కుల్ని పేల్చటం వంటి పిరికి చర్యలు చేస్తుం టారు ఉగ్రవాదులు. ఏదో ఒక ఎన్‌కౌంటర్లో దారుణంగా చచ్చిపోతుంటారు. చస్తామని తెలి సీ విధ్వంసకాండ ఎందుకు చేస్తారో తెలియదు. అమాయక ప్రాణాల్ని ఎందుకు పొట్టన పెట్టు కుంటారో అంతకన్నా అర్థంకాదు.

"పింకీ! ఏమిటి ఆలోచిస్తున్నావ్?" అన్నాడు జస్వీందర్.

ఆలోచనల నుండి తేరుకుంటూ "ఏమీలే దు... మన జీవితాలగురించే ఆలోచిస్తున్నాను." అన్నాడు పింకీ.

నవ్వి "మనజీవితాల గురించి ఆలోచించే ది, చర్చించేది ఏముంది? మనం గురుగోబిం దసింగ్ కాలంలో కూడా సిపాయిలమై ధర్మయు ద్ధాలు చేసి ఉంటాం. మళ్లీ మాతృభూమి సేవ చేయటానికి ఈ జన్మ ఎత్తాం" అన్నాడు జస్వీం దర్.

"కావొచ్చు..." అన్నాడు ఆత్మీయంగా జ స్వీందర్ కేసి చూస్తూ.

"మనది జన్మజన్మల అనుబంధం. లేకపోతే కాశ్మీర్‌లోను, మళ్లీ కార్గిల్‌లోనూ మనం కలిసి విధులు నిర్వర్తించే అవకాశాన్ని భగవంతుడిచ్చే వాడు కాదు..." అన్నాడు జస్వీందర్.

"ఆ విషయం నేను నమ్ముతాను..." అన్నా డు పింకీ. అంతలో గట్టిగా మంచుగాలి వీచిం ది. గాలిలో మంచు ముక్కలు తేలియాడాయి. ఇద్దరి మీదుగా ఆ గాలి వెళ్లటంతో వంటినిండా మంచు పడింది. పింకీ వంటిమీద పడిన మం చుని జస్వీందర్ దులిపేడు. అలాగే పింకీ కూ డా మిత్రుడి వంటిమీద మంచుని దులిపాడు.

"జస్వీందర్... నీకు ఇటీవలనే పెళ్లయింది కదూ?"

"అవును!"

"నువ్వు శెలవునుండి తిరిగి వస్తున్నప్పుడు నీ నవవధువు బాధపడి ఉండాలే..." తన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ అడిగేడు పింకీ.

"ఎందుకు బాధపడదు?... ధైర్యం చెప్పాను. ఇందులో బాధపడాల్సింది, భయపడాల్సిందీ ఏమీలేదు. కాశ్మీర్‌లో తీవ్రవాదులతో గత మూడేళ్లుగా పోరాడుతూనే ఉన్నానని చెప్పాను."

"ఏమంది?"

"వాహెగురు మిమ్మల్ని సదా కాపాడతాడు - అంది."

"అవును- వాహెగురు మంత్రమే మనకు రక్షాకవచం"

అంతలో శత్రువుల కదలికలు గోచరించాయి.

"జస్వీందర్! శత్రువులరుగో... కనిపిస్తున్నారుగా?" అన్నాడు పింకీ. అంతలో వాళ్లు తుపాకీలు పేల్చటం జరిగింది. దూసుకువస్తున్న తూటాల నుండి కాపాడుకోవటానికి చప్పున నేలమీద పడుకున్నారిద్దరూ.

"జస్వీందర్... ఊఁ... కాల్చు..." అంటూ తను కూడా తుపాకీకి పని చెప్పాడు. కొద్దిసేపు కాల్పులు జరిగాయి. అవతలి నుండి కాల్పులు ఆగిపోయాయి.

"చచ్చినట్లున్నారు దుర్మార్గులు" అన్నాడు కసిగా పింకీ.

"అలాగని మనం నిర్లక్ష్యంగా ఉండకూడదు. శత్రువులు యుద్ధరంగంలో అనేక ఎత్తులు, జిత్తులు ప్రదర్శిస్తూ ఉంటారు" అన్నాడు జస్వీందర్.

"నువ్వు చెప్పింది కూడా నిజమే" అన్నాడు పింకీ శత్రు స్థావరాలవైపు అనుమానాస్పదంగా చూస్తూ. చాలాసేపు మౌనం రాజ్యమేలింది.

"జస్వీందర్! మీ ఇంట్లో నువ్వే పెద్దవాడివా?"

"ఊహూఁ కాదు... నాకు ఇద్దరు అన్నలున్నారు..."

"వ్యవసాయం చేస్తారా?"

"ఏం వ్యవసాయంలే...! దేవుడు సాయం చేసి వర్షం కురిపించకపోతే, ఆ సంవత్సరం గడ్డితినాల్సిందే... కేవలం మూడెకరాల పత్ర ఉంది. ఐదుగురున్న కుటుంబానికి అదేం సరిపోతుంది? అందువల్ల నేను 17 సంవత్సరాలకే ఆర్మీలో చేరాను..."

"మంచి పనిచేసావు. మన సిపాయిలు దేశ సేవ మాత్రమే కాదు. కుటుంబ సేవ కూడా నిజాయితీగా చేస్తుంటారు..."

అంతలో మళ్లీ శత్రువులు కాల్పులు ప్రారంభించారు.

"అదుగో... వాళ్లు మళ్లీ మనల్ని కవ్విస్తున్నారు..." అంటూనే పింకీ ఎదురు కాల్పులు ప్రారంభించాడు.

"పింకీ... మనం ఆ రాతిగుట్ట వెనక్కి వెళితే శత్రువులు మనల్నేమీ చెయ్యలేరు. మనం వాళ్ల పని పట్టొచ్చు..." అన్నాడు జస్వీందర్‌సింగ్.

పింకీ అటు చూసాడు.

నిజమే! రాతిగుట్ట వెనక్కి వెళ్లగలిగితే బాగానే ఉంటుంది. పాకుతూ వెళ్లాలంటే చాలాసేపు పడుతుంది. త్వరగా వెళ్లాలంటే ప్రాణాలకు తెగించి పరుగు తీయాలి. ప్రస్తుతం ఇక్కడ ఉన్నది ఇద్దరే. శత్రువుల్ని నిలువరించకపోతే, శత్రువుల గుళ్లకి బలయిపోతే, ఈ పోస్టు వాళ్ల వశం అవుతుంది. అలా జరక్కూడదు...

"వద్దు జస్వీందర్. అది ప్రాణప్రమాదం..."

"ఇక్కడున్నా ప్రాణప్రమాదం తప్పదు. చూసావా... తూటాలు ఎలా మీదకు వస్తున్నాయో... నేను వెళ్తున్నాను" అంటూ జవాబు కెదురుచూడకుండా గుట్టవైపు పరుగుతీసాడు జస్వీందర్.

★ ★ ★

రమేష్ వినాయక్‌కి ముందుగా నిలువెత్తుగా ఉన్న జస్వీందర్‌సింగ్ ఫొటో ఆ ఇంటి మొదటి గదిలో దర్శనమిచ్చింది. చేతిలోని పుష్పగుచ్ఛాన్ని ఆ ఫొటో వద్ద ఉంచి, వెంట తెచ్చిన పూల మాలతో అలంకరించాడు. అతని ఆత్మశాంతికై ప్రార్థిస్తూ కొద్ది నిమిషాలు మౌనంగా తలవంచుకు నిలబడ్డాడు విలేఖరి రమేష్ వినాయక్.

జస్వీందర్ భార్య గురుదయాళ్‌కౌర్ పెద్ద గ్లాసుతో చిక్కటి మజ్జిగ తెచ్చి ఎదురుగా ఉంచింది. ఆమె మామగారు, అంధుడైన జోగిందర్ గోడకి ఆనుకుని నిశ్శబ్దంగా కూర్చున్నాడు.


"శత్రువుని నిలువరించడానికి ఎవరో ఒకరు ఆత్మత్యాగం చేయవలసిందే. అది మా అబ్బాయి వంతు అయింది..." అన్నాడాయన.

"మా విషాదం దేశానికి అదృష్టాన్ని సంపాదించి పెట్టాలి. మాకు అదే ఓదార్పు..." అంది కౌర్. విలేఖరి వినాయక్ ఆమె మనోస్థైర్యానికి చేతులు జోడించాడు.

"ఒకసారి మీరు బయటకు వస్తే ఫొటో తీసుకుంటాను. మీ గురించి పత్రికలో రాస్తాను..." అన్నాడు రమేష్ వినాయక్.

"ఏమిటి దానివల్ల ఉపయోగం?" అడిగాడు జోగిందర్.

"ఎందరికో అది స్ఫూర్తినిస్తుంది. దేశాభిమానం పెంచుతుంది"



"అయితే సరే!"

రమేష్ వాళ్ల ఫొటో తీయటంలో నిమగ్నమైనాడు.